క్లుప్తంగా

గ్రామాల్లో తాగునీటి పరీక్షలు



ప్రత్తిపాడు: భారీ వర్షాల నేపథ్యంలో పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈవోపీఆర్డీ షేక్ ఖాజా, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్‌కుమార్‌లు ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించారు. ప్రజలకు సరఫరా చేసిన తాగునీటిని పరిశీలించారు. వాటిని సేకరించి పరీక్షలు నిర్వహించారు. రక్షిత మంచినీటి పథకాల వద్ద ఉన్న మైక్రో ఫిల్టర్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాలో సిబ్బంది జాగ్రత్తలు పాటించాలన్నారు. నీటిని వడగట్టి, బ్లీచింగ్ పౌడర్ కలిపి సరఫరా చేయాలని స్పష్టం చేశారు. అన్ని గ్రామాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు నీటి నాణ్యతా పరీక్షలను కచ్చితంగా చేయాలని ఆదేశించారు. వెంట వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు తహసీల్దార్ కె. రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యక్రమం నిర్వహించడం లేదని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేడు పాఠశాలలకు సెలవు

ప్రత్తిపాడు: భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు ఎంఈవో రమాదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఈ ఆదేశాలు పాటించాలని ఎంఈవో తెలిపారు.

చెరువు కట్ట తెగకుండా ఏర్పాట్లు



ప్రత్తిపాడు: భారీ వర్షాలకు వాగులు పొంగిపొర్లుతుండటంతో ప్రత్తిపాడు రక్షిత మంచి నీటి చెరువు పూర్తిగా నిండింది. అధికారులు కట్ట భద్రతపై దృష్టి సారించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్‌కుమార్, ఈవోపీఆర్డీ ఖాజాలు ప్రత్తిపాడు చెరువు కట్ట లాక్ గేట్లను మూసి వేయించారు. ఇసుక బస్తాలను అడ్డుగా ఉంచారు.

నేలలో సేంద్రియ పదార్థాలు పెంచాలి



గుంటూరు రూరల్: నేలలో సేంద్రియ పదార్థాలు తప్పనిసరిగా పెంచాలని వ్యవసాయ శాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె. రామచంద్రం తెలిపారు. అప్పుడే పంటలను కాపాడుకోవటంతోపాటు ఆరోగ్యకరమైన దిగుబడి పొందవచ్చని చెప్పారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతునేస్తం ఫౌండేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సేంద్రియ వ్యవసాయంపై రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. హరిత విప్లవం పేరుతో వ్యవసాయంలో రసాయనాలు ప్రవేశపెట్టడం తదితర కారణాలతో రైతులు విచక్షణరహితంగా వాటిని వినియోగిస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల నేలలో ఉండే సూక్ష్మజీవులు నశిస్తున్నాయని పేర్కొన్నారు. నేలలో తగిన మోతాదులో సేంద్రియ పదార్థాలు ఉంటే జీవజాలం తగిన మోతాదులో ఉండడానికి అవకాశం లభిస్తుందన్నారు. పచ్చిరొట్ట పైర్లు వేయడం, వ్యవసాయ వ్యర్థాలను భూమిలో కలియదున్నడం, సేంద్రియ ఎరువుల వినియోగం ఈ దిశగా మేలు చేస్తాయన్నారు. నాబార్డు సహకారంతో రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ అభినందనీయం అన్నారు. వెటర్నరీ డాక్టర్ వీఏఎస్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ ఒకప్పుడు ప్రతి రైతు పశుపోషణ చేపట్టేవారన్నారు. సాగు అనుబంధ రంగాలను అశ్రద్ధ చేయడం తగదని చెప్పారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ధార్మిక ప్రాంగణంలో భారతీధార్మిక విజ్ఞాన పరిషత్ బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో చతుర్దశి, మాసశివరాత్రి సందర్భంగా ఆదివారం విశ్వశాంతిని కాంక్షిస్తూ చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొమ్మిది మంది వేదపండితుల నిర్వహణలో గణపతికి, శివలింగానికి, నవగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు, లక్ష్మీ గణపతి, చండీ, రుద్ర హోమాలు నిర్వహించి, పూర్ణాహుతి చేశారు.

నానుతున్న పైరు.. రైతన్నకు కన్నీరు!

- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు
- క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యే, అధికారుల పరిశీలన
- పొన్నూరు మండలంలో 23 వేల ఎకరాల్లో నీట మునిగిన వరి
- ముంపు నీరు పోయే దారి లేక అన్నదాతల అవస్థలు



వంగిపురంలో చెరువులా మారిన పంట పొలాలు



నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



పరిశీలిస్తున్న ఏవో అరుణకుమారి తదితరులు

ప్రత్తిపాడు: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో వంగిపురం గ్రామాన్ని వరద నీరు ముంచెత్తింది. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వంగిపురానికి ఎగువ ప్రాంతాల్లో ఉన్న కొండవాగు, నక్కల వాగు, రామవాగు, షరావత్ కాలువ, మేకల వాగులు ఉధృత రూపం దాల్చాయి. దీంతో ఆదివారం పంట పొలాలు వరద నీటితో నిండి తటాకాలను తలపించాయి. కనుచూపు మేరలో ఎటు చూసినా వరదనీరే కనిపిస్తోంది. గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పైరు 650 , మినుము 120 , పత్తి 40 ఎకరాల్లో నీట మునిగింది. దీంతో రైతులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. వ్యవసాయాధికారి అరుణకుమారి, తహసీల్దార్ కె. రవికుమార్‌లు వంగిపురంలో పంట పొలాలను పరిశీలించారు. తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. నీట నానుతున్న పంట పొలాలను స్థానిక శాసన సభ్యుడు బూర్ల రామాంజనేయులు కూడా ట్రాక్టర్‌పై వెళ్లి పరిశీలించారు. ఎన్ని ఎకరాల్లో పంటలు నీట మునిగాయి, ఏ కాలువల వల్ల ఏటా సమస్య ఉత్పన్నమవుతోంది, వరద ముంపునకు గురికాకుండా ఉండాలంటే శాశ్వత చర్యలు ఎలా చేపట్టాలి? వంటి వివరాలను ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఊరట కల్పించేలా ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో గుంటూరు చానల్‌కు పడిన గండిని, నీట నానుతున్న పంటలను పరిశీలించారు. పునరావాస కేంద్రంలో బాధితులతో మాట్లాడారు. వారికి ఆహారాన్ని అందించారు.

ముంపు బారిన పొలాలు..

పొన్నూరు: భారీ వర్షాలతో మండలంలోని 20 రెవెన్యూ గ్రామాల్లో పొలాలు ముంపు బారిన పడ్డాయి. మొత్తం 30 ఎకరాలకు గానూ 23 వేల ఎకరాలకు దాకా ముంపునకు గురయ్యాయని వ్యవసాయాధికారుల నివేదికలు చెబుతున్నాయి. మరో ఏడు వేల ఎకరాల్లో ఇప్పుడిప్పుడే వరిసాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వారికి కురుస్తున్న వర్షాలు ఉపయోగకరంగా ఉన్నాయి. గత రెండు రోజుల నుంచి కురిసిన కుండపోత వర్షాలతో వరి నాట్లు వేసిన పొలాల్లో ముంపు నీరు చేరడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని వెల్లలూరు, మన్నవ, కసుకర్రు, మాచవరం, మునిపల్లె, సీతారాంపురం, ములుకుదురు, పచ్చలతాడిపర్రు, గోళ్లమూడిపాడు, బ్రాహ్మణకోడూరు, వెల్లలూరు తదితర ప్రాంతాల్లోని వరి పొలాల్లోకి ముంపునీరు చేరి రైతాంగాన్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. పంట కాల్వల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయి నీటి సరఫరాకు ఆటంకం కలిగించాయి. దీంతో కాలువలు పొంగిపొర్లడంతో పొలాల్లోకి భారీస్థాయిలో నీరు చేరింది. బయటికి పోయే దారిలేక లేకపోవడం రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేసింది. ఈ ఏడాది పంట కాలువల్లో పూడికతీత పనులు సాగలేదని, మండల పరిషత్ సమావేశాల్లో ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా జలవనరుల శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ గత నెలలో కురిసిన వర్షానికి పొలాల్లో చేరిన ముంపు నీరు బయటకు వెళ్లక 20 శాతం మంది రైతులు వరి పంటకు దూరమయ్యారు. నాట్ల కోసం ఎకరాకు రూ.8 నుంచి రూ. 10 వేలకు పైగా ఖర్చుపెట్టారు. పలు గ్రామాల్లో పంట కాలువల్లో పూడిక తీయకపోవడం వల్ల దెబ్బతినే పరిస్థితిని గమనించి ఖరీఫ్ సాగుకు దూరమయ్యారు. కొంతమంది రైతులు వ్యవసాయ పనులకు వెళ్తున్నారు.

పంట నష్టం అంచనా వేయిస్తాం

టీకేపాలెం(కాకుమాను): పంట పొలాలలో నీరు బయటకు వెళ్లిన వెంటనే వ్యవసాయశాఖ అధికారులతో నష్టం అంచనా వేయించి ప్రతి రైతును ఆదుకుంటామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. మండలంలోని టీకేపాలెం, లింగగుంటపాలెం గ్రామాలలో నీట మునిగిన పంటలను, వాగులను ఆదివారం పరిశీలించారు.

సముద్రాన్ని తలపిస్తున్న పంట పొలాలు

చేబ్రోలు: మండలంలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు పంట పొలాలు నీటమునిగాయి. ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం భారీగా వచ్చి చేరుతుండటంతో దిగువ ప్రాంతాల్లోని లోతట్టు భూములు ముంపు బారిన పడ్డాయి. నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో సముద్రాన్ని తలపిస్తున్నాయి. చేబ్రోలు మండల పరిధిలోని 13 గ్రామాల పరిధిలోని పొలాల్లో వరద నీరు భారీగా చేరడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నారాకోడూరు, వడ్లమూడి, వేజండ్ల, సుద్దపల్లి, శేకూరు, శ్రీరంపురం, మంచాల, గొడవర్రు తదితర గ్రామాల పొలాల్లో నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. శేకూరు, శలపాడు, వీరనాయకునిపాలెం గ్రామాల పరిధిలోని నల్ల డ్రైయిన్, తుంగభద్ర డ్రైయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. సాగునీటి కాలువలు సైతం నిండుకుండలా ఉన్నాయి. శ్రీరంగపురం, నారాకోడూరు, సుద్దపల్లి, శేకూరు, మంచాల తదితర గ్రామాల్లోని వరి పంట పొలాలు సముద్రాన్ని తలపిస్తున్నాయి. ఈ ఏడాది సాగు, మురుగు నీటి కాలువలకు మరమ్మతులు చేయకపోవడంతో తూడికాడ, తుంగ, నాచుతో నిండిపోయాయి. దీని వల్ల ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీరు దిగువకు వెళ్లడానికి జాప్యం జరుగుతోంది. పొలాల్లో నీరు నిలబడటంతో పంట దెబ్బతింటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

గుంటూరు కెనాల్, హై లెవెల్ కెనాల్‌కు గండ్లు

పెదకాకాని: భారీ వర్షాల ప్రభావంతో పంట కాలువలకు గండ్లు పడి వరి పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. తంగెళ్లమూడి , పెదకాకాని, నంబూరు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, దేవరాయభట్లపాలెం తదితర గ్రామాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఇళ్ల చుట్టూ వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తంగెళ్లమూడి, నంబూరు గ్రామాల్లో పూరిళ్లు కూలిపోయాయి. ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ధాన్యం బస్తాలు తడవడంతో ఆరబెట్టుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. గుంటూరు చానల్‌కు పెదకాకాని లాకులు, తక్కెళ్లపాడు, నంబూరు వద్ద గండ్లు పడ్డాయి. హై లెవెల్ కెనాల్‌కు నంబూరు వద్ద గండి పడింది. దీంతో వేల ఎకరాల పంట పొలాలు నీట మునిగాయి. మరో రెండు రోజులు పాటు నీరుంటే పైరు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. మండల పరిధిలోని కొప్పురావూరు గ్రామానికి రాకపోకలు బంద్ అయ్యాయి. జాతీయ రహదారి నుంచి గ్రామంలోకి వచ్చే ప్రధాన రహదారిపై రైల్వే గేటుకు అండర్ బ్రిడ్జి నిర్మించారు. అక్కడ రెండు రోజులగా కురుస్తున్న వర్షాలకు నీరు భారీగా చేరింది. దీంతో ఈ గ్రామం వెళ్లాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ ఉప సర్పంచ్ విన్నకోట పూర్ణ శంకరరావు రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదు. దీంతో ఆయనే మోటార్ ఏర్పాటు చేసి, నీటిని బయటకు పంపుతున్నారు.



వెల్లలూరులో ముంపు బారిన పొలాలు



కసుకర్రులో నీట మునిగిన వరి పొలాలు



పెదకాకాని సమీపాన గుంటూరు చానల్‌కు గండి

నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకోవాలి



వరగానిలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న బలసాని కిరణ్ కుమార్

వరగాని(కాకుమాను): కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుని ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజక వర్గ ఇన్‌చార్జి బలసాని కిరణ్ కుమార్ కోరారు. పెదనందిపాడు మండలంలోని వరగాని గ్రామంలో నీట మునిగిన పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా పంట పొలాలు నీట మునిగాయని తెలిపారు. దీని వలన రైతులు ఎంతో నష్టపోయారని పేర్కొన్నారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏ సీజన్‌లో పంట నష్టపోతే అదే సీజన్‌లో రైతులకు పరిహారం అందించారని తెలిపారు. అన్ని విధాలుగా అన్నదాతలను ఆదుకున్నారని చెప్పారు. రైతులకు పరిహారంతోపాటు విత్తనాలు కూడా ఉచితంగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, రైతులు ఉన్నారు.

పంట కాలువలకు త్వరలో మరమ్మతులు

ఎమ్మెల్యే ధూళిపాళ్ల



పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు: భారీ వర్షాలకు మండలంలో నీటమునిగిన పొలాల్ని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదివారం పరిశీలించారు. మండలంలోని మాచవరం, ములుకుదురు, పచ్చలతాడిపర్రు, మునిపల్లె, గోళ్లమూడి పాడు, బ్రాహ్మణకోడూరు, వెల్లలూరు గ్రామాల్లో నీట మునిగిన పొలాల్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట పొలాలకు ప్రధానమైన కాలువల్ని మరమ్మతులు చేయకుండా వదిలేయడం వల్ల విపత్తుల సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వీటినైనంత త్వరగా మరమ్మతులు చేయించి రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాదాల వెంకటేశ్వరరావు, బొర్రా రామారావు, బండ్లమూడి బాబూరావు, సోపాటి వెంకట్రావు, గ్రామాల రైతులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

● పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మండలంలోని కొండమూదిలో గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ తల్లి కొలుపు మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే నరేంద్రకుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



వంగిపురంలో చెరువులా వరి పొలాలు



పత్తి చేనులో నిలిచిన నీరు



నారాకోడూరు వద్ద నీట నానుతున్న పందిరి తోట



సుద్దపల్లిలో డొంక రోడ్డుపై వరద నీరు



శేకూరు గ్రామ సమీపంలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్న నల్ల డ్రైయిన్

నేడు మహానేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ తెలిపారు. పట్టణంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నూరు పట్టణంలోని పార్టీ కార్యాలయంతో పాటు, చేబ్రోలు, పెదకాకాని మండలాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు డాక్టర్ రూత్ రాణి, ఆకుల వెంకటేశ్వరరావు, సర్పంచ్ వీరయ్య పాల్గొన్నారు.

ఉప్పలపాడు, గొల్లమూడి మధ్య వంతెన నిర్మాణం

- కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని
- హై లెవెల్ చానల్‌పై కల్వర్టు నిర్మాణానికి ఆదేశాలు



మృతుల కుటుంబ సభ్యులకు చెక్కును అందజేస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

పెదకాకాని: ఉప్పలపాడు వాగు ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు చిన్నారులు, ఉపాధ్యాయుని ఘటనపై గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ స్పందించారు. ఆదివారం గ్రామంలో పర్యటించారు. వాగు వద్ద వంతెన నిర్మాణానికి గాను అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఉప్పలపాడు, గోళ్లమూడి గ్రామాల మధ్య త్వరలో వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆయన సూచించారు. నిర్మాణానికి వీవీఐటీ కళాశాల యాజమాన్యం రూ. 50 లక్షలు సహకారం అందిస్తామన్నారని ఈ సందర్భంగా పెమ్మసాని తెలిపారు. అనంతరం వర్షాలకు ఉప్పలపాడులో జరిగిన పంట నష్టాన్ని కూడా ఆయన పరిశీలించారు. హై లెవెల్ చానల్ పొంగి దాదాపు ఐదు వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నీట మునిగాయని పెమ్మసాని వద్ద రైతులు వాపోయారు. గతంలో ఉన్న కల్వర్టు కూలిపోయిన తర్వాత తాము అందరం కలిసి తూములు ఏర్పాటు చేసుకున్నా ఉపయోగం లేకుండా పోయిందని చెప్పారు. తక్షణమే స్పందిస్తూ సంబంధిత శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లికార్జునరావుతో పెమ్మసాని ఫోన్లో మాట్లాడారు. కల్వర్టు నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలని తెలిపారు. ఎంపీ నిధుల ద్వారా వీలైనంత త్వరగా కల్వర్టు నిర్మాణాన్ని చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బూసి బాబు, ఎంపీటీసీ సభ్యుడు మోపర్తి శ్రీనివాసరావు, కొరప్రాటి సాంబశివరావు, అప్పాజీ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి

అనంతరం మృతుల కుటుంబ సభ్యులను మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పరామర్శించారు. స్కూల్ యాజమాన్యం కనీస జాగ్రత్తలు తీసుకో పోవడం కారణంగానే తమ మనవడిని పోగొట్టుకున్నామని చిన్నారి మాన్విక్ అమ్మమ్మ, తాతయ్య కన్నీటి పర్యంతరం అయ్యారు. ప్రభుత్వం ప్రకటించిన ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం చెక్కును మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ టి. కృష్ణకాంత్, గ్రామ సర్పంచ్ కర్నాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నారాయణదాస జయంత్యుత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై ఎం.నారాయణ దాస కథాగాన కళాపరిషత్‌ఆధ్వర్యంలో శ్రీనారాయణ దాస 160వ జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజులుపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం హరికథా చూడామణి, పురాణం విజయలక్ష్మీ భాగవతారిణితో రుక్మిణీ కళ్యాణం హరి కథాగానం జరిగింది. వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై ఎం.నగధరరావు వాయిద్యాన్ని అందించారు. సంస్థ అధ్యక్షులు కర్రా సూర్యనారాయణదాసు, తాడేపల్లి సింహాద్రిశాస్త్రి, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ పోలేరమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నగరంపాలెం: స్థానిక కోబాల్డుపేట ఏడో వీధిలోని పోతురాజు సహిత శ్రీపోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అత్యంత వైభవంగా కొలుపులు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అలంకారణ, అభిషేకాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అశోక్‌నగర్, దేవాపురం, బ్రాడీపేట ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పొంగళ్లు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను దేవస్థానం నిర్వాహకులు అందజేశారు. గ్రామోత్సవం దేవస్థానం నుంచి మొదలై కోబాల్డుపేట మీదగా బ్రాడీపేట, దేవాపురం, కోబాల్డుపేట 8వ వీధి మీదగా దేవస్థానం వరకు అంగరంగ వైభవంగా చేపట్టారు.



గ్రామోత్సవంలో స్థానికులు

జల దిగ్బంధంలో వట్టిచెరుకూరు



ఓ వీధిలో ప్రజల అవస్థలు



చెరువును తలపిస్తున్న పంట పొలాలు

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం జలదిగ్బంధంలో చిక్కుకుపోయింది. పోటెత్తిన వరద నీటితో పలు గ్రామాలు నీట మునిగాయి. ఎటు చూసినా పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గ్యాస్ కంపెనీ, రహదారులు, అంతర్గత వీధుల్లో భారీగా నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.